# పాపభీతి

ఆచంట శారదాదేవి

"నువ్వు వచ్చావ్, కాని నేను ఊరికి వెళ్ళాలి. మా అన్నయ్య ఏదో …ంటి పని మీద రమ్మని రాశాడు. ఇవ్వాళ …స్తా వన్నాను. నువ్వు వుండిపో! నేను రేపు తప్పక వచ్చేస్తాను. సరదాగా మాట్లాడు కుందాం! సుశీలకు తోడుగా కూడా వుంటావు. లేకపోతే ఒక్కత్తే …క్క మంటూ ఉంటుంది" అంటూ …త్సాహంగా వీపు తట్టాడు కృష్ణ, అతను వచ్చిన కాసేపటికి.

ఆ తరువాత యింకాస్సేపటికి వెళ్ళిపోయాడు. అతనూ బస్సుదాకా వెళ్ళి ఎక్కించి వచ్చాడు. అతను ఇంకోసారి వెళ్ళిపోతానన్నాడు. కృష్ణ ఒప్పుకోలేదు. ఉండమని బలవంత పెట్టాడు. "…ండు రోజులు ఉందామని వచ్చావుగా, వుండిపో రేపు వే నెలాగూ వచ్చేస్తాను …నా!" అన్నాడు. అతని కేమీ తోచలేదు. బస్సు కదిలాక ఇంటి ముఖం పట్టాడు.

ఒక రోజంతా సుశీలతో ఒంటరిగా గడపటమంటే అతనికి ఒక పక్క సంతోషమూ, మరొక పక్క భయంగా ఉంది. కృష్ణ లేకుండా అతనెప్పుడూ సుశీలతో ఒంటరిగా గడపలేదు. కృష్ణ ఎదురుగా ఆమెతో ఎంతో చనువుగా వుంటాడు. పరిహాసమాడతాడు, అల్లరి చేస్తాడు. ఒక్కొక్కసారి వ్యామోహం ఉ… నలా ముందుకు వస్తే కల్లోలపడతాడు. అంతే. అంతవరకే, తరువాత తన తోవ తనది, వారి తోవ వారిది. ఆ దంపతులతో అతనికి చాలా ఏళ్ళుగా పరిచయం ఉంది. ఆ ఇంటికి ఆప్త బంధువులా వస్తున్నాడు, పోతున్నాడు. ఆ దంపతు లిద్దరూ అతనిని ఎంతగానో ఆదరిస్తున్నారు.

సుశీల మీద అతనికి వ్యామోహం ఆమెకు పెళ్ళి కాక పూర్వమే ఏర్పడింది. ఆమె అతనికి ఎదురింట్లో కొన్నాళ్ళు వుండేది: అతను కాలేజీలో చదువుతుండేవాడు, ఆమె స్కూల్లో చదువుతూ వుండేది మొదట్లో అతను ఆమెను శ్రద్ధగా గమనించలేదు. పట్టించుకోలేదు, ఏదో ఒక క్షణాన అతని చూపు ఆమె వైపు ప్రసరించింది. ఆ క్షణం ఆమె ఎంతో అందంగా ఆకర్షణీయంగా కనిపించింది. అతని మనసు చలించింది. వ్యామోహము కమ్ముకుంది. అప్పటి నుంచి తదేక దీక్షగా ఆమెను చూస్తూనే వున్నాడు. క్షణ క్షణమూ మనసు వివశమౌతూనే వుంది, తన అనురాగం ఆమెకు చెప్పాలనుకున్నాడు. చెప్పలేదు. అంతలో ఆమె పెళ్ళి పత్రిక వచ్చింది. ఆమె పెళ్ళి జరిగింది. వరుడు ఎవరో కాదు, అతని స్నేహితుడు, సహాధ్యాయి కృష్ణ. ఎందుకో అది అతనికి సంతోషాన్ని కలిగించింది. అందరిలా తనూ పెళ్ళికి వెళ్ళాడు, వధూవరులను ఆశీర్వదించాడు! కృష్ణతో కబుర్లు చెప్పాడు. సరసమాడాడు. చదువుపూర్తయి అతనూ కృష్ణ ఉద్యోగాల్లో చేరారు. ఇద్దరూ పక్క పక్క వూళ్ళల్లోనే వుంటున్నారు. అతను పెళ్ళి చేసుకోలేదు. తమ్ముళ్లు, చెల్లెళ్ళు చదువుకోవలసినవాళ్లు, పెళ్ళి కావలసినవాళ్లు చాలా మంది వున్నారు. సంసార భారం పెద్దది. ఆ వూబిలో నుంచి ఎప్పుడయినా మనసుకు వూరట కావలసినప్పుడల్లా ఒక రోజో రెండు రోజులో కృష్ణ దగ్గరకు పారిపోతూ వుంటాడు. అతని స్నేహం, ఆప్యాయత మనసుకు చల్లగా ఉంటుంది. సుశీల ఎదట మనసు పరవశమౌతూ వుంటుంది.

కాని ఇవ్వాళ ఇలా కృష్ణ తనను ఒంటరిగా వదలి వెళ్ళడం ఏదో కొత్తగా వుంది. ఆమెతో ఏకాంతంగా కాస్సేపు గడపవచ్చుననే ఊహ సంతోషాన్ని కలిగిస్తోంది. అది ఎన్నాళ్ళగానో ఎదురు చూస్తున్న అదృష్టం. అయినా మనసులో భయం పీకుతోంది, మనసులో అనురాగం హద్దులు తెంచుకుని ఏమీ అనుచితంగా ప్రవర్తించడు గదా! జన్మ జన్మాల అనుబంధంగా వస్తున్న స్నేహాన్ని క్షణంలో తుడిచివేసుకోడు గదా! సుశీల తనతో ఎంతో చనువుగా ఉంటుంది. ఎంతో ఆప్యాయంగా

మాట్లాడుతుంది. కష్ట సుఖాలు చెబుతుంది. ఆమెకు తన మీద అనురాగమున్నా? అది తనకు అంతు తెలియని రహస్యం.

ఇంటికి రాగానే సుశీల ఎదురుగా వచ్చింది. "బస్సు అందిందా?" అంది నవ్వుతూ. "ముందుగానే ప్రయాణం పెట్టుకున్నారు, లేకపోతే వెళ్ళకపోదురు" అంది. ఆమె మామూలుగా ఉ[illegible]ంచ లేదు. ఏదో మాట్లాడాలని మాట్లాడినట్లు, ఏదో సంకోచపడుతున్నట్లు వుంది. ఇద్దరూ హాల్లో కూచున్నారు. కాస్సేపు కాలం మౌనంగా గడిచింది. ఇద్దరికీ ఏదో అపరిచిత వ్యక్తుల్లా కొత్తగా ఉంది. మామూలుగా మాటలు తోచలేదు. కాసేపటికి సుశీల బల్లమీది పత్రికలు అతని ముందుకి తోసింది. "ఇవి చూస్తూ ఉండండి. వంట పూర్తిచేసి వస్తాను" అంటూ వెళ్ళిపోయింది.

వంట దగ్గర కూర్చున్న ఆమెకు ఏదో మతి పోయినట్లుంది. మనసులో బెంగగా వుంది. ఒక రోజంతా అతనితో ఎలా ఒంటరిగా గడపటం! ఏం మాట్లాడాలి? ఎలా ప్రవర్తించాలి? అంతా కొత్తగా వుంది. సాయంత్రమయితే పనిమనిషి తాయారమ్మ కూడా ఇంటికి పోతుందేమో రాత్రంతా ఒంటరిగా ఉంటే ఏమవుతుంది! ఎవరినయినా తోడు పిలుద్దామంటే స్నేహితులెవ్వరూ దగ్గరగా లేరు, రావటానికి. అంతా అయోమయంగా ఉంది! ఎన్నాళ్ళగానో తనకు అతని కళ్ళల్లో అనురాగం కనిపిస్తోంది. అది తాను గమనించనట్లే నిర్వికారంగా ప్రవర్తిస్తోంది. అయినా అది ఏ క్షణానన్నైనా హద్దు మీరుతుందేమోనన్న భయం మాత్రం మనసును తరుచు బాధిస్తోనే ఉంది. అతను తమకు ఎంతో సన్నిహితుడు.

అతను తనూ కృష్ణ కలిసి కబుర్లు చెప్పుకుంటూ ఉంటే గంటలు క్షణాలుగా గడిచిపోతాయి. ఆ స్నేహం ఎంతో విలువయింది. ఆ స్నేహాన్ని పోగొట్టుకోడానికి గాని, అతని మనసు నొప్పించడానికిగాని ఆమె మనసు చాలా బాధ పడుతుంది. ఆ పరిస్థితి రాకుండా రోజులు గడచిపోతే చాలుననుకుంటూ ఉంటుంది. ఎప్పుడైనా చపలత్వంతో అతను తన్ను తాకినా తన మనసు నిర్వికారంగా ఉంటోంది. అసహ్యమూ కలుగదు, అప్యాయతా కలుగదు. అది ఏదో దగ్గర బంధువు స్పర్శలా సహజంగా ఉంటుంది. కాకపోతే పసిపిల్లవాడిలా ఎందుకీ చాపల్యం అని మాత్రం కాస్త విసుగ్గా ఉంటుంది.

వంట పూర్తిగా అయ్యాక అతనిని భోజనానికి పిలిచింది. వడ్డిస్తూ ఇంట్లో అందరిని గురించి అడిగింది కాలక్షేపానికి. అతను ఏదో చెప్పాడు, అప్పుడప్పుడూ అతను తనకేసి దీక్షగా అప్యాయంగా చూసినప్పుడు తను చూపులు మరల్చుకుంది. తాము ఏమీ చూడనట్లే వూరుకుంది.

భోజనమయ్యాక అతన్ని మేడ మీదకు వెళ్ళి పడుకోమంది. తాను పత్రికలు చూస్తూ, తాయారమ్మతో కబుర్లు చెబుతూ కిందనే కూచుంది. నాలుగు గంటలకు అతనికి కాఫీ టిఫిను చేసి సిద్ధంగా ఉంచింది.


*Hearty Deepavali Greetings :*

**PIONEER AUTOMOBILES**

Head Office ;

**Congress Office Road - VIJAYAWADA-2**

Grams : 'AUTOMOBILE' P. B. No. 352

Phones : Office : 3[illegible]44

Res : 4414


★

Branch :

**Raja Rammohanroy Road.**

**VISAKHAPATNAM**

Phones, Office : 2224 - Res. 2242




రాత్రి దగ్గరపడేకొద్దీ ఆమెకు భయమూ బెంగా ఎక్కువయ్యాయి. స్నేహితుడి మనస్సు నొప్పించటం ఆమెకు ఇష్టం లేదు. ఏ క్షణాన ఏ విధంగా అది తప్పని సరి అవుతుందేమోనన్న భయం కమ్ముకుంది. అతను నిద్రలేచి స్నానం చేసి ఆమె యిచ్చిన కాఫి టిఫిను తీసుకున్నాడు. ఈసారి అతను ఆమెకేసి ఆప్యాయంగా దీక్షగా చూడలేదు, తల వంచుకుని ముభావంగా వున్నాడు, కాఫీ త్రాగడం పూర్తయ్యాక మెల్లగా అన్నాడు, "ఇప్పుడు బస్సు వుంది, నేను వూరికి వెళతాను. మళ్ళా వచ్చేవారం వస్తాను" అన్నాడు. ఒక్కక్షణం అమె తెల్లబోయింది. కాని మనసులో బరువు దింపినట్లయింది. ఆమె అతన్ని ఉండమని అనలేదు. అతను వెళ్ళిపోయాడు.

కృష్ణ వచ్చేదాకా వుంటానన్నవాడు ఎందుకు వెళ్ళినట్లు! బహుశా తన మనసులోలాగే అతని మనసులోను ఏదో సంకోచము, భయమూ పీడిస్తూవుంటాయి. ఒక్కరోజు ఒంటరిగా వుండటానికి భయపడ్డాము. ఇద్దరమూ యింత పిరికివాళ్ళమేమీ అనుకుంది. అయినా అదే బాగుంది. సరిహద్దు దాటని స్నేహం కలకాలం నిలుస్తుంది. ఆమె మనసులో అతనిని అభినందించుకుంది. *